## క్లుప్తంగా

### దేవరగట్టులో ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న పూజారి

**హొళగుంద:** దేవరగట్టులో ఆదివారం మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారికి సుప్రబాత సేవ, జలాభిషేకం, కుంకుమార్చన, బండారార్చన, పుష్పార్చన, మహామంగళారతి, ఆకుపూజా, నైవేద్యం సంతర్పణ తదితర పూజలు చేపట్టారు. స్థానికులతో పాటు కర్ణాటక, తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆస్పరి మఠంలో అన్నదానం చేపట్టారు.

### పేదలకు దుస్తుల పంపిణీ


పేదలకు బట్టలు పంపిణీ చేస్తున్న దాతలు

**మద్దికెర :** మండల పరిధిలోని పెరవలి గ్రామంలో పారా సేవా సమితి సభ్యులు పారా రామచంద్రప్రసాద్, పారా విశ్వనాథ్, పారా జయవర్ధన్ కుటుంబసభ్యులు 200 మంది నిరుపేదలకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఏటా రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని నిరుపేదలకు పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. వలి, పక్కీరప్ప, రామయ్య పాల్గొన్నారు.

### చిత్ర హింసలు భరించలేకే ఆత్మహత్య

**తుగ్గలి :** రెండు రోజులు క్రితం రామాపురంలో మహిళ ఆత్మహత్యకు సంబంధించి జొన్నగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. బతుకుదెరువు నిమిత్తం తమిళనాడుకు వెళ్లిన రామాపురం వెంకటేశ్వర్లుకు అక్కడ రాజేశ్వరి అనే మహిళ పరిచయమైంది. స్వగ్రామంలో వీరిద్దరు రెండున్నరేళ్లుగా కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి రాజేశ్వరి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వెంకటేశ్వర్లు చిత్రహింసలు భరించలేకే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి గోవిందు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జయశేఖర్ ఆదివారం తెలిపారు.

### నీటి సమస్యను పరిష్కరించండి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

**ఆలూరు రూరల్:** మండలంలోని కురుకుంద గ్రామంలో నెలకొన్న తీవ్ర తాగునీటి ఎద్దడిని నివారించాలని సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి హనుమంతు డిమాండ్ చేశారు. స్థానిక జ్యోతిబసు భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిందె నీటి కోసం గ్రామస్తులు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. 15 రోజులకు ఒక సారి సరఫరా అయ్యే తాగు నీరు కొన్ని ప్రాంతాలకే సరిపోతున్నాయని, దళిత కాలనీ వాసులు తాగునీరు లేక ఇబ్బంది పడుతుంటే అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఈరన్న,అల్లప్ప, వెంకటేష్ ఉన్నారు.

# పది పరీక్షలకు వేళాయె

- ఆలూరు నియోజకవర్గంలో 24 కేంద్రాలు
- పరీక్ష రాయనున్న 5,064 మంది విద్యార్థులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



ఆలూరులోని ప్రభుత్వ బాలుర-1 పాఠశాల పరీక్ష కేంద్రం

**ఆలూరు రూరల్:** మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. టెన్త్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమై ఈ నెల 31వ తేదీన ముగియనున్నాయి. ఈ మేరకు నియోజకవర్గంలో 24 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఏడాది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 5,064 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

**పకడ్బందీగా నిర్వహణ..**

నేటి నుంచి జరిగే పది పరీక్షలకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఆలూరులో ప్రతి కేంద్రానికి ఒక డిపార్ట్ మెంటల్ చీఫ్‌తో పాటు 6 కేంద్రాల్లో 86 గదులు కేటాయించారు. 40 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించనున్నారు. విద్యార్థులకు కోసం అన్ని వసతులు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా పరీక్షలు జరపనున్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం ఆర్టీసీ అధికారులు ఉచిత ప్రయాణం కల్పించారు.

- **పరీక్షల సమయం:** రోజూ ఉదయం 9.30 గంటలకు ప్రారంభమై.. మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష ఉంటుంది.

**ఆలూరులో పది పరీక్ష కేంద్రాల వివరాలు..**

| పరీక్ష కేంద్రం | విద్యార్థుల సంఖ్య | కేటాయించిన గదులు |
|---|---|---|
| ప్రభుత్వ బాలుర పాఠశాల-1 | 245 | 15 |
| ప్రభుత్వ బాలుర పాఠశాల-2 | 240 | 16 |
| ఏపీ మోడల్ స్కూల్ | 300 | 14 |
| జెడ్పీ హైస్కూల్ (బాలికల) | 280 | 15 |
| సెయింట్ జాన్స్ హైస్కూల్ | 280 | 14 |
| ప్రగతి ప్రైవేట్ స్కూల్ | 250 | 12 |

**నియోజకవర్గంలో పది పరీక్షల కేంద్రాలు, విద్యార్థుల సంఖ్య..**

| మండలం | కేంద్రాలసంఖ్య | విద్యార్థుల సంఖ్య |
|---|---|---|
| ఆలూరు | 6 | 1,595 |
| ఆస్పరి | 5 | 945 |
| చిప్పగిరి | 2 | 289 |
| హాలహర్వి | 3 | 555 |
| హొళగుంద | 4 | 789 |
| దేవనకొండ | 4 | 891 |
| మొత్తం | 24 | 5,064 |

### ఏర్పాట్లు పూర్తి చేశాం



పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఎక్కడా మాల్ ప్రాక్టీస్, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు,డెస్కులు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నాం. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు అరగంట ముందే చేరుకోవాలి. – కోమలా దేవి, ఎంఈఓ,ఆలూరు

### నేటి నుంచి పది పరీక్షలు

**చిప్పగిరి:** సోమవారం నుంచి జరిగే పది పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా ఒకటి స్థానిక జెడ్పీహెచ్ స్కూల్, రెండవది ఫాతిమా ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేయగా మొత్తం 284 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. పరీక్ష కేంద్రంలోకి ఉదయం 8.45 గంటలకే అనుమతి ఇస్తారని పరీక్ష 9.30 కి ప్రారంభమై 12.45 కి ముగుస్తుందని ఎంఈఓ సావిత్రమ్మ తెలిపారు. ఒత్తిడి కి లోను కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని విద్యార్థులకు ఆదివారం సూచించారు.

- **హాలహర్వి:** మండలంలో సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే విద్యాశాఖ అధికారులు పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని ఎంఈఓ-2 శ్రీనివాసరెడ్డి ఆదివారం తెలిపారు.
- **కృష్ణగిరి:** సోమవారం నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు సంబంధించి పకడ్బందీగా చేసినట్లు ఎంఈఓలు సునంద, మద్దయ్య ఆదివారం తెలిపారు. మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కృష్ణగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సెంటర్‌లో 240 మంది, కంబాలపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 170, అలాగే అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల సెంటర్‌లో 152 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రానికి అరగంట ముందే చేరుకోవాలని సూచించారు.
- **మద్దికెర :** మండలంలో పదవ తరగతి పరీక్షలకు మండల కేంద్రంలో జెడ్పీ ఉన్నత బాలురు, జెడ్పీ ఉన్నత బాలికల పాఠశాలల్లో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని ఎంఈఓ రంగస్వామి ఆదివారం తెలిపారు. మండలంలో 6 ఉన్నత పాఠశాలలున్నాయన్నారు. అందులో 531 మంది విద్యార్థులుండగా.. 428మంది విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా.. పెరవలిలోని ఉన్నత పాఠ శాలకు చెందిన విద్యార్థులు తుగ్గలిలో రాస్తార న్నారు. చీఫ్‌లుగా దేవేంద్రప్ప, జాకీర్‌హుసేన్, డీఓలుగా భీమలింగప్ప, వెంకటరాముడును నియమించామన్నారు.

### ఉచితంగా ఏపీసెట్ కోచింగ్

**మద్దికెర :** ఆపద్బాంధవ సేవాసమితి ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఈనెల 20 వ తేదీ నుంచి ఉచితంగా కోచింగ్ ఇస్తామని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చొక్కా సునీల్‌కుమార్ ఆదివారం తెలిపారు. గుంతకల్లు పట్టణంలోని విజేత హాస్పిటల్ బ్యాక్‌సైడ్‌లోనున్న గౌతమ్ స్టడీ సర్కిల్‌లో ఉచితంగా కోచింగ్‌తో పాటు ఉచిత మెటీరియల్ అందించి ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తి గల వారు 8247452174 నంబర్‌కు ఫోన్ చేసి తమ పేరును రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

### 18న ఉచిత కంటి వైద్య శిబిరం

**తుగ్గలి :** జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి వైద్య బృందం వారితో ఈనెల 18వ తేదీన పగిడిరాయి పీహెచ్‌సీలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆప్తాల్మిక్ అసిస్టెంట్ హనుమంతరెడ్డి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అవసరమైన వారికి అదే రోజు కర్నూలుకు తీసుకెళ్లి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారని చెప్పారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### నేడు వినతుల స్వీకరణ

**చిప్పగిరి:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యలపై వినతులు స్వీకరిస్తామని తహసీల్దార్ ఇజాజ్ అహ్మద్ ఆదివారం తెలిపారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో బాగంగా ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించి పరిష్కారం చూపుతామని చెప్పారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు ఏ సమస్యపైనైనా అర్జీలు సమర్పించుకోవచ్చన్నారు.

## రాజకీయ డ్రామాలొద్దు.. అభివృద్ధి చేయండి


పత్తికొండలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

**పత్తికొండ రూరల్ :** రాజకీయ డ్రామాలొద్దు చిత్తశుద్ధితో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్సార్‌సీపీ అధినేత పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన తరువాత ఈప్రాంత రైతుల ప్రయోజనార్థం ఇచ్చిన మాట నిలుపుకునేందుకు జీవో 739 జారీ చేసి టమాట ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. రూ.12 కోట్లు మంజూరు చేసి హోసూరు రోడ్డులో కేటాయించిన 3.50 ఎకరాల విస్తీర్ణంలోని నిర్మాణానికి వర్చువల్‌గా ప్రారంభోత్సవం చేసిన తరువాత తాము భూమిపూజ చేసి బెడ్డింగ్ పనులు కూడా పూర్తి చేసిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. నాటి జీవోతో కూటమి ప్రభుత్వం రివైజ్డ్ చేసి జీవో 37 పేరుతో హంగామా చేస్తూ కనకదిన్నెలో భూమిపూజ చేయడం రాజకీయ డ్రామాలాగా కనిపిస్తుందన్నారు. రైతులనుంచి అభిప్రాయ సేకరణ లేకుండా స్థలాన్ని ఎలా మారుస్తారని ప్రశ్నించారు.

**అసెంబ్లీ సాక్షిగా పచ్చి అబద్ధాలు..**

నియోజకవర్గంలోని చెరువులకు నీరు నింపే విషయంలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అసెంబ్లీ సాక్షిగా పచ్చి అబద్ధాలు మాట్లాడారని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వ హయంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను కొనసాగించి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తాము పూర్తిగా సహకరిస్తామన్నారు. నియోజకవర్గంలో చెరువుల పనులు ఎవరి హయాంలో పనులు జరిగాయే ఇరిగేషన్ రికార్డులను ఒకసారి పరిశీలించుకోవాలని సూచించారు. ఎంపీపీ నారాయణదాస్, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ నాయక్, మండల కన్వీనర్ కారంనాగరాజు, వైఎస్సార్‌సీపీ రైతు సంఘం జిల్లా నాయకుడు గాంధిరెడ్డి, సర్పంచులు చెన్నకేశవరెడ్డి, శ్రీరాములు. గణపతి, హుసేన్, రవిరెడ్డి పాల్గొన్నారు.

### 21న వెల్దుర్తి పంచాయతీ వేలాలు

**వెల్దుర్తి:** స్థానిక మేజర్ పంచాయతీ వేలాలు ఈనెల 21వ తేదీన పంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఈఓ లక్ష్మీనాథ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వారపు సంత, దిన కూరగాయలు, పార్కింగ్, జంతువధ శాలలతో పాటు చిన్న, పెద్ద మాంసపు అంగళ్లు, సంత మార్కెట్‌లోని 13 అంగళ్లు, రామళ్లకోట రోడ్డులోని 8 అంగళ్లకు వేలాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఏడాది పాటు కాల పరిమితికి చేపట్టు వేలాలలో పాల్గొనదలచిన వారు, వేలాలు పొందిన వారు తగిన ఆస్తి ధ్రువపత్రాలతో, దరావత్తు, డిపాజిట్లు చెల్లించాలని సూచించారు. వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

### శిథిలావస్థలో బస్‌షెల్టర్


ఎల్లార్తి రోడ్డులోని పెద్దహ్యాట క్రాస్‌లో శిథిలావస్థలో బస్ షెల్టర్

**హొళగుంద:** మండలంలోని ఎల్లార్తి రోడ్డులోని పెద్దహ్యాట క్రాస్‌లో ఉన్న బస్ షెల్టర్ శిథిలావస్థకు చేరి ప్రయాణికులు, గ్రామస్తులకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదు. పక్కనే ఉన్న చేతిపంపు చెడిపోయి నెలలు గడుస్తున్నా పట్టించుకునేవారు లేరు. ప్రయాణికుల సౌకర్యం కోసం 30 ఏళ్ల క్రితం ఎంపీ ల్యాడ్స్ నిధులతో బస్ షెల్టర్‌ను అసంపూర్తిగా పూర్తిచేశారు. ఆలన పాలన లేక శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారింది. పక్కనే కొండ ఉండడంతో షెల్టర్ లోపల ముళ్ల కంపలు పెరిగి, విష పురుగులకు ఆవాసంగా మారింది. ఇక షెల్టర్ పక్కనే ఉన్న చేతి పంపు చెడి పోయినా మరమ్మతు చేయించే నాథుడు కరువయ్యారు. బస్సుల కోసం నిరీక్షించే వారికి నీడ, నీళ్లు లభించని పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి ప్రయాణికుల సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


మరమ్మతులకు గురైన చేతిపంపు

### జాతర స్పెషల్


కడ్డీలు కాలుస్తున్న దృశ్యం

**మద్దికెర :** పెరవలిలో జరుగుతున్న శ్రీరంగనాథ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉత్సవాలు ప్రారంభమైనప్పటి నుంచి ఉగాది వరకు దాదాపు నెలరోజుల పాటు మాంసాహారాన్ని ఇళ్లలోకి తెచ్చుకోరు. దీంతో మాంస ప్రియుల కోసం గ్రామంలో కడ్డీలు (మాంసాన్ని కడ్డీలకు గుచ్చి కాల్చడం) కాల్చి విక్రయిస్తారు. వ్యాపారులు 20 రోజుల పాటు ప్రత్యేకంగా అంగళ్లు ఏర్పాటు చేసి మాంసాన్ని కోసి కారం, ఉప్పు, మసాలా దట్టించి కడ్డీలకు గుచ్చి బొగ్గులపై కాల్చి అమ్ముతుంటారు. రుచికరంగా ఉండటంతో వీటికి డిమాండ్ అధికంగా ఉంటుంది. చుట్టు పక్కల ప్రాంతాల వారు కూడా భారీగా వస్తుంటారు. కాగా.. కేవలం ఉత్సవాల సమయంలో మాత్రమే కడ్డీలను విక్రయిస్తారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి


వెల్దుర్తిలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

**పత్తికొండ రూరల్ :** అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం పత్తికొండలో ఘనంగా నిర్వహించారు. నాలుగు స్తంభాల కూడలిలో ఏర్పాటు చేసిన పొట్టిశ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడని కీర్తించారు. టీడీపీ నాయకులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు ఉన్నారు.

- **వెల్దుర్తి:** మండల కేంద్రంలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి ఆదివారం నిర్వహించారు. స్థానిక మెయిన్ బజారులోని పొట్టి శ్రీరాములు, జాతిపితల విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాతబస్టాండులో ప్రజలకు మజ్జిగ పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో శ్రీరాములు, సురేశ్, సాయిప్రసాద్, సత్యం, కిరణ్, ప్రసాద్, శేషు, కార్తీక్, ప్రసాద్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పాల్గొన్నారు. స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి కవితాబాయ్ పాఠకులతో కలిసి పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
- **దేవనకొండ:** స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బండ్లయ్య, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎ.ఉచ్చీరప్ప మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన మహనీయుడని కొనియాడారు.

## నేడు ఎన్టీఆర్ వైద్యసేవ సిబ్బంది విధుల బహిష్కరణ

**కర్నూలు(హాస్పిటల్):** డిమాండ్ల సాధనకై రాష్ట్ర ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలం కావడంతో డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ)లో పనిచేస్తున్న వైద్యమిత్రలు ఈ నెల 17వ తేదీన విధులు బహిష్కరించనున్నట్లు ఏపీ వైద్యసేవ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సి.కంబరి, ఉపాధ్యక్షుడు జి.రాజశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాము 17 సంవత్సరాలుగా ఎన్టీఆర్ వైద్యసేవ/ఆరోగ్యశ్రీ పథకంలో పనిచేస్తున్నామని, సమస్యల పరిష్కారం కోసం అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. అందుకే ఈ నెల 17, 24 తేదీల్లో (రెండు సోమవారాలు) జిల్లాలోని వైద్యసేవ జిల్లా సమన్వయాధికారి కార్యాలయం వద్ద నిరసనలు, 27వ తేదీన ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్(మంగళగిరి)లో గాంధేయ పద్ధతుల్లో శాంతియుతమైన నిరసనలు తెలపాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు.

### గజేంద్రుడిపై విహరించిన శ్రీరంగనాథుడు


గజేంద్రునిపై కొలువుతీరిన శ్రీవారు

**మద్దికెర :** పెరవలిలో వెలసిన శ్రీరంగనాథుడు వార్షిక బ్రహ్మోత్సవాల భాగంగా ఆదివారం గజోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటు పల్లకీ సేవ చేపట్టారు. రాత్రి శ్రీరంగనాథుడు, శ్రీదేవి, భూదేవి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి గజేంద్రుడిపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. కాగా.. సోమవారం ఉదయం శ్రీవారు, శ్రీదేవి, భూదేవిలకు కల్యాణోత్సవం, సాయంత్రం అశేష భక్తజన వాహిని మధ్య రథోత్సవం ఉంటుందని ఈఓ వీరయ్య ఆదివారం తెలిపారు.

### రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

**ఎమ్మిగనూరురూరల్:** రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని పట్టణ ఎస్‌ఐ డాక్టర్ హెచ్.నాయక్ సూచించారు. కర్నూలులో రౌడీ షీటర్ హత్య జరిగిన నేపథ్యంలో పోలీసులు అలర్ట్ అయ్యారు. ఆదివారం పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో టౌన్ ఎస్‌ఐ డాక్టర్ నాయక్ రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు.



# పండుగకు పప్పన్నం లేనట్లే!

- కార్డుదారులకు ఈ నెల అందని కందిపప్పు
- జనవరి, ఫిబ్రవరిలో అరకొరగా సరఫరా
- ఈ నెలలో పూర్తిగా నిలిపివేసిన ప్రభుత్వం
- పాలకుల తీరుపై ఆసహనం వ్యక్తం చేస్తున్న పేదలు


తుగ్గలి మండలం అమినాబాద్‌లో ఎండీయూ వాహనం ద్వారా బియ్యం మాత్రమే వేస్తున్న దృశ్యం

**కృష్ణగిరి:** తెలుగువారికి పెద్ద పండుగ అయిన ఉగాదికి పేద ప్రజలు పప్పన్నం తినలేని పరిస్థితి ఏర్పడింది. మరి కొద్ది రోజుల్లో ఉగాది పండుగ వస్తుండటంతో ప్రతి ఒక్కరూ తమకు చక్కెరతో పాటు కందిపప్పు కావాలని అడుగుతున్నారు. పత్తికొండ నియోజకవర్గ వ్యాప్తంగా 180 రేషన్ దుకాణాలు ఉన్నాయి. అయితే పౌర సరఫరాల శాఖ గోడౌన్‌లకు కందిపప్పు సరఫరా లేకపోవడంతో రేషన్ డీలర్లు చేతులెత్తేశారు.

**కంది పప్పు సరఫరాలో ప్రభుత్వం విఫలం..**

తెల్లరేషన్ కార్డుదారులకు ప్రభుత్వం అందించే కందిపప్పు కోటాలో సరఫరా నిలిపివేసింది. దీంతో తెల్ల రేషన్ లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో కంది పప్పు అందలేదు. మార్కెట్లో కిలో కందిపప్పు రూ.140 పలుకుతున్నా..కార్డుదారులకు రాయితీపై కిలో రూ.67కు అందిస్తామంటూ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడిచినా రేషన్ కందిపప్పు, వంట నూనె కార్డుదారులకు సక్రమంగా సరఫరా చేయడంలో దారుణంగా విఫలమైంది.

**తలలు పట్టుకుంటున్న అధికారులు, డీలర్లు..**

ప్రభుత్వం ఏడు నెలల నుంచి రేషన్ దుకాణాలకు అరకొరగా కందిపప్పు సరఫరా చేస్తుండంటతో అటు అధికారులు, ఇటు డీలర్లు తలలు పట్టుకుంటున్నారు. ఉగాది పండుగ దగ్గరకు వస్తున్న నేపథ్యంలో రేషన్ దుకాణాల వద్ద కార్డుదారులు కంది పప్పు కోసం ఎదురుచూసినా ప్రయోజనం లేకుండా పోయింది. మండల వ్యాప్తంగా జనవరి, ఫిబ్రవరి నెలలో ఆరకొరగా ఇచ్చినా మార్చి నెలలో మాత్రం పూర్తిగా ఎత్తేసింది. దీంతో ప్రభుత్వ తీరుపై ప్రజలు ఆహసనం వ్యక్తం చేస్తున్నారు. కందిపప్పు ఎందుకు ఇవ్వడం లేదని కార్డుదారులు అక్కడక్కడ డీలర్లతో వాగ్వాదానికి దిగుతున్నారు. ప్రభుత్వం నుంచే సరఫరా లేనప్పుడు తాము ఎలా ఇచ్చేదని సమాధానం చెబుతున్నారు. జగనన్న పాలనలో ప్రతి ఒక్క కార్డుదారునికి బియ్యం, చెక్క, గోధుమపండి, జొన్నలు, రాగులు పంపిణీ చేసిన విషయాన్ని వారు గుర్తు చేసుకుంటున్నారు.

**ఆకాశాన్నంటిన నిత్యావసరాల ధరలు..**




తెలుగు వారి గొప్ప పండుగైన ఉగాది పండుగకు ప్రతి ఒక్కరూ పిండి వంటలు చేసుకోవడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరుకులైన శనగ, కంది పప్పు, బెల్లం, నూనె ధరలు అమాంతం పెరిగాయి. కంపెనీని బట్టి లీటర్ నూనె రూ.130 నుంచి రూ.140 వరకు విక్రయిస్తున్నారు. దీంతో ఈ యేడాది ఉగాది పండగకు పిండి వంటలు చేసుకుని తినడం కూడా కష్టమేనని పేద ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ధరలు తగ్గించాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తుండటంతో వస్తువుల దీపావళి టపాసుల్లా ఆకాశాన్ని తాకుతున్నాయని విమర్శిస్తున్నారు.

**పత్తికొండ నియోజకవర్గంలోని రేషన్ షాపుల వివరాలు**

| మండలం | రేషన్‌షాపులు | రేషన్ కార్డులు |
|---|---|---|
| కృష్ణగిరి | 28 | 14,449 |
| వెల్దుర్తి | 44 | 18,453 |
| తుగ్గలి | 46 | 19,442 |
| పత్తికొండ | 38 | 19,044 |
| మద్దికెర | 24 | 11,288 |
| మొత్తం | 180 | 82676 |

### కందిపప్పు ఇవ్వడం లేదు



ఈ నెలలో ఉగాది పండుగ ఉన్నందున ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డుదారులకు కంది పప్పు ఇస్తుందనుకుంటే ఇవ్వలేదు. మాలాంటి సామాన్య ప్రజలకు కిలో కందిపప్పు ఇస్తే బాగుంటుంది. బయట మార్కెట్లో కిలో కందిపప్పు రూ.140 వరకు ఉంది. ఈ విషయంలో ప్రభుత్వం ఆలోచించి అందరికీ కంది పప్పు ఇవ్వాలి. – అనంతమ్మ, జి. మల్లాపురం

### కందిపప్పు అలాట్‌మెంట్ కాలేదు

ఈ నెలలో పంచదార, బియ్యమే ఇస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఈ నెల కందిపప్పు అలాట్‌మెంట్ కాలేదు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో కూడా ఉన్నంత వరకు రేషన్ షాపులకు సరఫరా చేశాం. ఈ నెల పూర్తిగా సరఫరా లేకపోవడంతో డీలర్లకు అందజేయలేదు.
–గౌరీ శంకర్, డీటీ, ఎంఎల్ఎస్ పాయింట్, వెల్దుర్తి